క్లుప్తంగా

అర్హులందరికీ పింఛన్లు



నూతన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. మండల కేంద్రానికి కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం స్థానిక సచివాలయం-2 వద్ద పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మండలానికి 233 పింఛన్లు మంజూర కాగా కౌతాళంకు 37 మందికి మంజూరైనట్లు చెప్పారు. కార్యదర్శి ఆంజనేయులు, ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆదోనిరూరల్ : బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రాంజల చెరువు కట్టపై వేసిన గ్రావెల్ పనుల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.అజయ్‌బాబు, మండల కార్యదర్శి కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదోని పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. గతంలో అనేక సార్లు సీసీ లైనింగ్ దెబ్బతిని నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేకపోయిందన్నారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు, షేక్షావలి, పట్టణ అధ్యక్షులు భీమేష్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

వెండి వడ్డాణం విరాళం



ఆలయ పూజారికి వెండి వడ్డాణం అందజేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాల్ గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామికి అదే గ్రామానికి చెందిన ఆర్ నరసింహారెడ్డి దంపతులు 15 తులాల వెండి వడ్డాణం విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయ పూజారి వెంకయ్యస్వామికి వడ్డాణం అందజేసి ప్రత్యేక పూజలు చేపట్టారు.

షెడ్ ఏర్పాటుకు విరాళం



డా.సిద్ధప్పతాతను సన్మానించిన ఉపాధ్యాయులు

ఆదోనిరూరల్ : మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గదుల కొరత తీవ్రంగా ఉందని ఉపాధ్యాయులు డా.సిద్ధప్పతాతను కలిసి విన్నవించారు. స్పందించిన ఆయన రూ.1.50 లక్షలు ఖర్చు చేసి రేకుల షెడ్‌ను నిర్మించగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు సన్మానించారు. మాజీ ఎంపీపీ పంపాపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షం వస్తే చిత్తడి చిత్తడి



పత్తి టీఎంసీలో నిల్వ ఉన్న నీరు

ఆదోనిఅర్బన్/ఆదోనిటౌన్ : వర్షం వస్తే పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని పత్తి టీఎంసీ చిత్తడిగా మారుతోంది. దీంతో అమ్మకానికి వచ్చిన దిగుబడులు తడిచిపోతున్నాయి. పత్తి టీఎంసీలో కొన్ని చోట్ల లీకేజీల వల్ల, టీఎంసీ వేయడంతో సగం టాప్ లెవెల్‌లో మాత్రమే రేకులు వేయడంతో మిగిలిన సగభాగంలో నుంచి వర్షపునీరు కిందకు వస్తున్నాయి. టెండర్ అయిన తర్వాత తడిచిన పత్తిని వ్యాపారస్తులు తీసుకెళ్లడాని ఒప్పుకోకపోవడంతో కొంత బాజు ఇవ్వాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణ లో వర్షపు నీరు నిలిచి కుంటను తలపిస్తుంది. ఆదివారం రాత్రి కురిసిన మోస్తరు వర్షానికి మోకాళ్ల లోతు వరకు నిల్వ ఉండిపోయాయి.



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిలిచిన మురుగు నీరు



అన్వేటి మంటపం నుంచే స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



విశేష అలంకరణలో ఈరన్న స్వామి



ఆరుబయట నైవేద్యం వండి పూజలు చేస్తున్న దృశ్యం

ఉరుకుంద క్షేత్రం.. భక్తజన సాగరం

- మూడవ సోమవారం సందర్భంగా తరలి వచ్చిన భక్త జనం
- కిటకిటలాడిన క్షేత్రం
- ఆదివారం నుంచే మొదలైన భక్తుల రాక
- దైవ దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం
- వర్షం కురుస్తున్నా లెక్కచేయని జనం
- కౌతాళం రూట్‌లో స్తంభించిన ట్రాఫిక్, నాలుగు గంటల పాటు శ్రమించి క్లియర్ చేసిన పోలీసులు
- ఈరన్నస్వామి నామస్మరణతో మారుమోగిన ఉరుకుంద

కౌతాళం: శ్రావణమాసం మూడవ సోమవారం సందర్భంగా ఈరన్నస్వామి నామస్మరణతో ఉరుకుంద క్షేత్రం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్త జనంతో క్షేత్రం ఇసుకేస్తే రాలనంతగా పరిసరాలు నిండిపోయాయి. క్షేత్రానికి వచ్చే దారుల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి తరలివచ్చారు. భక్తులు ముందుగా ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి క్యూలైన్లో నిలుచుకున్నారు. సుమారు ఐదు లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకుని ఉంటారని ఆలయ అధికారుల అంచనా. శ్రావణమాసంలో సోమ, గురువారాల్లో ముఖ్యమైనవిగా భావిస్తుండడంతో ఆ రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. కాగా..ఆదివారం ఉదయం నుంచే భక్తుల



భక్తులతో కిటకిటలాడుతున్న ఉరుకుంద క్షేత్రం

రాక మొదలైంది. ఆదివారం సెలవుతో పాటు సోమవారం ఈ ప్రాంతంలో పాఠశాలలు, వివిధ కార్యాలయాలకు ఆప్షన్ హాలిడే ఇస్తారు. రెండు రోజులు సెలవు కావడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం రాత్రి 7 గంటల వరకు దర్శన క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. ఆలయ పరిసరాల్లో ఎక్కడ చోటు దొరికితే అక్కడే వంటలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించడం కనిపించింది.

దైవదర్శనానికి 3 గంటల నిరీక్షణ..

కాలువలో పుణ్య స్నానాలు చేసి దర్శనానికి వచ్చిన భక్తులకు రద్దీ కారణంగా దర్శనం కోసం 3 గంటల పాటు నిరీక్షించాల్సిన వచ్చింది. మూడు కల్యాణ కట్టలు ఏర్పాటు చేసినా భక్తుల రద్దీకి అవి ఏమాత్రం సరిపోలేదు. దీంతో తలనీలాలు సమర్పించేందుకు భక్తులు బారులుదీరారు. కౌతాళం రూట్‌లో ట్రాఫిక్ జామ్ కావడంతో ఉదయం 11 గంటల నుంచి రెండు గంటల వరకు శ్రమించి పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. భక్తుల తాకిడికి ఆదోని, కోసిగి, కౌతాళం, హాల్వి రూట్‌లలో మూడు కిలోమీటర్ల వరకు ఎటూ చూసినా భక్తులే కనిపించారు. పొలాల్లో సైతం వంటలు వండి స్వామికి అక్కడే నైవేద్యం సమర్పించారు. ఆదివారం రాత్రి వర్షం రాకతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. సోమ వారం కూడా జల్లులు కురుస్తున్నా భక్తులు లెక్కచేయకుండా వచ్చి స్వామిని దర్శించుకున్నారు.



ఆదోని రూట్‌లో కిలోమీటర్ మేర భక్తుల తాకిడి





తుంగభద్ర దిగువ కాలువలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, కొండపైనే వంట, వార్పు

ఘనంగా మార్కండేయ స్వామి ఉత్సవాలు



పెద్దకడుబూరు: మార్కండేయ స్వామి, శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం



కోసిగి: ఎద్దుల బండిపై ఉత్సవమూర్తుల ఊరేగింపులో కలశాలతో వెళ్తున్న మహిళలు

కోసిగి: పద్మశాలీయుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి ఉత్సవాలు మండల కేంద్రంలో వైభవంగా జరిగాయి. శ్రావణమాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని స్వామి వారికి మూడు రోజులుగా వెండి కవచ అలంకరణ, అభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళ మహారతులు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతులు, మార్కండేయ స్వామి ఉత్సవమూర్తులను ఎద్దుల బండిపై కొలువుంచి కలశాలతో మహిళలు ముందు నడవగా.. మేళతాళలతో ఆలయం నుంచి కడపాళెంలోని ఈశ్వర దేవాలయం వరకు వెళ్లి యథాస్థానానికి చేర్చారు. ఊరేగింపులో పద్మశాలి కులస్తులు స్వామి వారి ఖడ్గాలు ఉచ్చరిస్తూ, నందికోల్ల ఆడించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు ఊరేగింపు ముగింపు పలికారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలో వెలసిన భక్త మార్కండేయ స్వామి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయ పెద్దలు, పద్మశాలీయుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చన, ఆకుపూజ, రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టి మహా మంగళహారతులు ఇచ్చారు. అనంతరం గణపతి పూజ, నవగ్రహ పూజ జరిపించి శివ పార్వతులకు ఊంజల సేవ చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.

ధరలు తగ్గించాలి

పెద్దకడబూరు : నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్ విమర్శించారు. మండలంలోని హెచ్.మురవణి గ్రామ సచివాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ రూ.400 కే వంటగ్యాస్ ఇవ్వాలని, నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

పింఛన్‌ల పంపిణీ



బాపూజీపేటలో కొత్త పింఛన్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం



ఇందిరానగర్‌లో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్ : పట్టణంలో వివిధ కారణాలతో నిలిపివేయబడిన పింఛన్లను పునరుద్ధరించారు. దీంతో పట్టణంలో 453 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. తమ పింఛన్‌ను ఏదో సాకులతో నిలిపివేశారని, ఇక పింఛన్ వస్తుందోరాదోనని ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2వ వార్డు బాపూజీపేట, శక్తిగుడి ప్రాంతాల్లో కొత్తగా పింఛన్‌లు మంజూరైన 16 మందికి సోమవారం కౌన్సిలర్ ఎ.వి. సురేష్, మాజీ మున్సిపల్ చైర్మన్, కన్వీనర్ దేవదాసు, కన్వీనర్లు రఘు, గోపాల్, 18వ వార్డు ఇందిరానగర్‌లో 8 మంది పింఛన్‌దారులకు కౌన్సిలర్ చలపతి, కన్వీనర్, మాజీ కౌన్సిలర్ గోవిందరాజులు, గృహసారథులు తాయప్ప, నారాయణ, శీను, నాగరాజ్, రాముడు వేర్వేరుగా పంపిణీ చేశారు.

విద్యార్థినికి సన్మానం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని శంకర్ నగర్‌కు చెందిన హుసేన్ హాజీర దంపతుల కుమార్తె షమీనా ఇటీవల నీట్‌లో 543 ర్యాంకు సాధించి మెడికల్ సీటు సాధించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దూదెకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు నూర్ బాషా, దూదేకుల సంఘం గౌరవ సలహాదారుడు పి.సాయి బాబా సోమవారం సన్మానించారు. అనంతరం చదువు నిమిత్తం రూ. 54,500 ఆర్థిక సాయం చేశారు. దూదేకుల సంఘం జిల్లా నాయకులు ఇమామ్ ఖాసిం, మొహబూబ్ బాషా, షెక్షావలి, సిద్దయ్య, మల్కన్న మాబు, వాలి, టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న పరిపాలనాధికారి గోవింద్‌సింగ్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని, నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవింద్‌సింగ్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్, మత్స్యశాఖ సహాయక ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన హరిజన చిన్నమారెప్పకు సర్వే నంబర్ 56/ఏ3, 57/సీలో ఎకరం భూమి కొనుగోలు ద్వారా సంక్రమించిందని, అలాగే.. మంత్రాలయం మండలం వగరు తిమ్మాపురం గ్రామానికి చెందిన చిక్కం విశ్రాంతికి సర్వే నంబర్ 178/1లో 7.12 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు మీద నమోదైందని, విచారణ చేపట్టి తన పేరు మీద నమోదు చేయాలని వారిద్దరూ అర్జీ అందజేశారు.

- ఆదోని పట్టణం శంకర్‌నగర్‌కి చెందిన సులోచనమ్మకు సర్వేనంబర్ 378 ప్లాట్ నంబర్ 12 ప్రభుత్వం వారు ఇంటి స్థలం కేటాయించారు. ప్రస్తుతం ఆ ఇంటి స్థలంలో వేరే వారు నివాసం ఉంటూ దౌర్జన్యం చేస్తున్నారు. ఆ స్థలం తమకు కేటాయించాలని అర్జీ సమర్పించారు.

- ఆదోని మండలం మాంత్రికి గ్రామానికి చెందిన జయలక్ష్మికి సర్వేనంబర్ 128లో 1.4 ఎకరాలు తమ పెద్దలకు ప్రభుత్వం నుంచి సంక్రమించిందని, ఈ భూమికి సంబంధించి ఆర్‌ఓఆర్, అడంగల్, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరారు.


నేడు హుండీ సొమ్ము లెక్కింపు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో మంగళవారం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ శ్రావణ మాసం ఉత్సవాల సందర్భంగా రెండో సారి హుండీ సొమ్మును లెక్కిస్తున్నామని చెప్పారు. పాల్గొనే వారు పంచ, ఉత్తరీయం ధరించి రావాలని కోరారు.

రాంజలకు మంచిరోజులు

పట్టణ సమీపంలో విస్తారంగా కొండలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నా.. పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దలేదు. ఆలోటు తీర్చాలనే పట్టణ ప్రజలు కోరిక మేరకు.. బ్రిటీష్ కాలంలో నిర్మితమైన రాంజల నల్ల చెరువు, పరిసరాలను పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.2.44కోట్లను విడుదల చేయడంతో అధికారులు వివిధ రకాల పనులు చేపట్టారు. పనులు పూర్తయితే పట్టణానికి రాంజల చెరువు మణిహారంగా మారనుంది.

- పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోనున్న జలాశయం, పరిసరాలు
- మొదటి విడతగా రూ.2.44 కోట్లు విడుదల
- ప్రారంభమైన పనులు
- పనులు పూర్తయితే ఆదోనికి మణిహారంగా మారనున్న చెరువు



రాంజల చెరువు, కొండలను వీక్షిస్తున్న స్థానికులు

కల్పించనున్న వసతులు..

రాంజల నల్లచెరువు పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. అధికారులు కల్పించే వసతులు, ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

- అమృత పథకం కింద మొదటి విడతగా రూ.2.44 కోట్లు విడుదలయ్యాయి.
- గట్టును బలంగా చేయడం
- ముళ్లపొదల తొలగింపు
- గర్జిచోహాట్ (కొట్టం)
- ఫుట్‌పాత్‌లు
- ఎంఎస్ రైలింగ్ (స్టీల్ తీగతో కంచె ఏర్పాటు)
- గ్రీనరీ డ్రైనింగ్ (పచ్చదనం ఏర్పాటు)
- రెస్టారెంట్
- చెరువులో బోట్లు నడపడం తదితర సౌకర్యాలను కల్పించేందుకు పనులు మొదలుపెట్టారు.



చెరువు గట్టుపై జరుగుతున్న గ్రావెల్ పనులను పరిశీలిస్తున్న అధికారులు



రాంజల నల్లచెరువు

ఆదోనిటౌన్ : బ్రిటీష్ కాలం నాటి రాంజల నల్లచెరువు దశాబ్దాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా చెరువు రాత మారలేదు. పట్టణంలో పర్యాటక కేంద్రం, పార్కులు లేవంటూ పట్టణ ప్రముఖులు, సీనియర్ సిటిజన్‌లు, విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ నాయకులు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పర్యాటక కేంద్రంగా రాంజల నల్లచెరువు, పరిసర ప్రాంతాలను తీర్చిదిద్దేందుకు అవకాశం ఉందని గుర్తించి చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, ఇంజినీరింగ్ అధికారులు, సబ్‌కలెక్టర్‌తో కలిసి సమీక్షించి, రాంజల నల్లచెరువును బృందంగా వెళ్లి పరిశీలించారు. పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాంతానికి అన్ని విధాలా అనుకూలమని తేల్చారు. దీంతో అధికారులు అమృత్ పథకం కింద దాదాపు రూ.30 కోట్ల మేర నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. దీంతో మొదటి విడతగా రూ.2.44 కోట్లు విడుదల చేశారు. రెండో విడతలో మరో రూ.2.56 కోట్లు మంజూరు కానున్నాయి. ఆ నిధులతో పనులు చేసేందుకు ఈనెల 2న అధికారులు, నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం స్టీల్ కడ్డీతో ప్రహరీ నిర్మాణం, చెరువు గట్టుపై బండ్ స్ట్రెంత్‌న్నింగ్ (గట్టు బలంగా ఉండేందుకు) పనులు చేపడుతున్నారు. దీంతో రాంజల నల్ల చెరువుకు మంచి రోజులు వచ్చాయని ప్రజలు సంబరపడుతున్నారు. కేవలం ప్రజల దాహార్తికే పరిమితమైన చెరువు ముున్ముందు పర్యాటక కేంద్రంగా బాసిల్లనుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రం నుంచి ఉరుకుందకు ఆటోలో వెళ్తుండగా అదుపు తప్పి ఆటో బోల్తా పడిన సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం కోసిగి నుంచి ఆటోలో బయలు దేరగా కోసిగి గ్రామ శివారులోని సాయిబాబా గుడి దాటి తర్వాత అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించ బోయి అదుపు తప్పి పక్కనే కల్వర్టు డివైడర్‌ను ఢీకొని గుంతలోకి పడిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న కోసిగికు చెందిన కొరివి వీరేష్, నరసమ్మ, ఈరన్నతో పాటు మరొకరి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలించారు.

నేటి నుంచి 16వ సామాజిక తనిఖీ

ఆదోనిరూరల్: మండలంలోని గ్రామాల్లో 16వ రౌండ్ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు, పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ ద్వారా జరిగిన పనులపై సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. ఎస్ఆర్‌పీ తిరుమలేష్, డీఆర్‌పీలు, వీఎస్ఏలు గ్రామస్థాయిలో తనిఖీ చేపడతారని చెప్పారు. కాగా 1475 ఉపాధి పనులకు వేతనాలు రూ.125,11,4,797, మెటీరియల్ పనులకు చెల్లింపులు రూ.34,90,551, పీఆర్ డిపార్ట్‌మెంట్ కన్వర్జెన్స్ పనుల సంఖ్య 73, మెటీరియల్ రూ.43,76,1761, రెండు డిపార్ట్‌మెంట్లకు సంబంధించి మొత్తం పనుల సంఖ్య 1548, వేతనాలు రూ.12,51,14,797, మెటీరియల్ కోసం రూ.47,25,2,312, మొత్తం రూ.17,23,67,109 వెచ్చించారని వివరించారు.

ఓటరు జాబితా పరిశీలనలో నిర్లక్ష్యం తగదు



కంబలదిన్నిలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రమాదేవి

పెద్దకడబూరు: ఓటర్ల జాబితా పరిశీలనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ కలెక్టర్ రమాదేవి హెచ్చరించారు. మండలంలోని కంబలదిన్ని గ్రామంలో బీఎల్‌ఓలు చేస్తున్న ఇంటింటి సర్వేను, పోలింగ్ బూత్‌లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, చేర్పులు, మార్పులు, తొలగింపుల విషయంలో బూత్‌స్థాయి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సర్వేలో మండల స్థాయి అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఓటర్ల జాబితా పరిశీలనలో వెనకబడిన బూత్‌లెవెల్ అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు మహేష్, వీఆర్‌ఓ సంజీవ రావు ఉన్నారు.

ఉదయనిధిపై చర్యలు తీసుకోవాలి

ఆదోనిఅర్బన్ : సనాతన ధర్మాన్ని అవమానించిన తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం పట్టణంలోని హిందూ సమాజ సంఘం నాయకులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కునిగిరి నీలకంఠ, సాయిప్రసాద్, విజయ్, సాయి మాట్లాడారు.

రమణీయం.. వీరభద్రుని కుంభోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామంలో శ్రావణ మాసం మూడవ సోమవారంలో భాగంగా వీరభద్రేశ్వరస్వామి కుంభోత్సవ కార్యక్రమం అత్యంత రమణీయంగా జరిగింది. పచ్చని కొండ దిగువన ఉన్న పెద్దహ్యాట సోమవారం దేవుని నామస్మరణతో మార్మోగింది. ఏటా జరిగే ఈ కార్యక్రమానికి స్థానికులే గాకుండా బంధువులు, చుట్టుపక్కల గ్రామస్తులు, ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ ఇలవేల్పు వీరభద్రేశ్వరుడిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. సోమవారం తెల్లవారుజామున గ్రామ శివారులో గంగి పూజ, కుంభాల ఊరేగింపు, శ్రీవీరభద్రుని వేషాధారి వీరకాసి దైవ వచనాలు, నందికోలు సేవ తదితర కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం స్వామి వారి ఆలయంలో రుద్రాభిషేక పూజలు జరిగాయి. హాజరైన స్వాములు భక్తులను ఆశీర్వదించారు. భక్తులకు అన్నదానం చేశారు.